నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, శనివారం 4 జనవరి 2025 | SIDDIPET


మృతురాలు మనీషా తల్లిదండ్రులను ఓదార్చుతున్న పంచాయతీరాజ్ డీఈ రాధికాలక్ష్మి

నర్సాపూర్‌లో మార్చురీ వద్ద మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

ఒక్కొక్కరిది ఒక్కో గాథ

మార్చురీ వద్ద మిన్నంటిన రోదనలు

నర్సాపూర్, జనవరి 3: నర్సాపూర్‌లోని ప్రభుత్వ దవాఖాన మార్చురీ వద్ద మృతుల కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. పంచాయతీరాజ్ ఏఈగా ఉద్యోగం పొంది నాలుగు నెలలు గడవక ముందే పాపగారి మనీషాను మృత్యువు కబలించింది. సంగారెడ్డి జిల్లాలో పీఆర్ ఏఈగా విధులు నిర్వర్తిస్తున్న మనీషా నర్సాపూర్ పీఆర్‌కు డిప్యుటేషన్‌పై వచ్చింది. జీడిమెట్ల ప్రాంతానికి చెందిన కవిత వెంకట్‌రెడ్డిలకు ఇద్దరు కూతుళ్లు. మొదటి కూతురు మనీషా, రెండో కూతురు మాళవిక. వ్యయప్రయాసలకోర్చి మనీషా తండ్రి కూతురును ఇంజినీరింగ్ చదివించారు. నాలుగు నెలల క్రితం పంచాయతీరాజ్ శాఖలో ఏఈగా ఉద్యోగం వచ్చింది.ఉద్యోగం వచ్చిందనే సంతోషం నాలుగు నెలలు గడవక ముందే కూతురు వారిని వదిలి అనంత లోకాలకు వెళ్లిపోయింది. ఉద్యోగం వచ్చిందనే సంతోషం లేకుండా పోయిందే..... మేము పడ్డ కష్టం వృథా అయ్యిందే అంటూ మనీషా తల్లిదండ్రులు దిక్కులు పిక్కటిల్లేలా ఏడ్చి నతీరు అందరినీ కంటతడి పెట్టించింది. మార్చురీ వద్దకు పంచాయతీరాజ్ డీఈ రాధికాలక్ష్మి చేరుకొని మనీషా తల్లిని పట్టుకొని కన్నీటి పర్యంతం అయ్యారు.

ఫ్రెండ్స్ రాలేదు డాడీ... నేను కూడా ఇంటికొస్తున్నా...

నా ఫ్రెండ్స్ కాలేజీకి రాలేదు డాడీ....నేను కూడా ఇంటికి వస్తున్నా అంటూ ఇంటికి తిరుగు ప్రయాణమైన దూడి ఐశ్వర్య తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు అందనంత దూరానికి వెళ్లిపోయింది. నర్సాపూర్ మండలం రుస్తుంపేట్ గ్రామానికి చెందిన మహేశ్వరి అనిల్ దంపతులకు కూతురు ఐశ్వర్య, కుమారుడు ప్రద్యుమ్న ఉన్నారు. ఐశ్వర్య కొంపల్లిలోని ఇగ్నైట్ ఐఏఎస్ అకాడమీలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నది. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు ఐశ్వర్యను కాలేజీలో దించి రాగా, మిత్రులు కాలేజీకి రాలేదని ఇంటికి వస్తున్నానని తండ్రికి ఫోన్ చేసింది. జాగ్రత్తగా రమ్మని తన తండ్రి చెప్పడంతో ఐశ్వర్య ఆటోలో ఇంటికి తిరుగుప్రయాణమైంది. మృత్యువు కారు రూపంలో దూసుకువచ్చి ఐశ్వర్యను కబలించింది. మృతదేహాన్ని నర్సాపూర్ మార్చురీకి తరలించడంతో కుటుంబసభ్యులు అంబులెన్సులో ఉన్న ఐశ్వర్య మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. ఒక్కగానొక్క కూతురు మరణించడంతో కుటుంబ సభ్యుల రోదనలు అందరినీ కలచివేశాయి.

మృత్యువుతో పోరాడి తనువు చాలించి...

హైదరాబాద్‌కు చెందిన అనసూయ రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు పలుచోట్ల విరగగా నర్సాపూర్ ఏరియా దవాఖానలో చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నారాయణ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కౌడిపల్లి మండల కేంద్రంలో పని నిమిత్తం అనసూయ ఆటోలో బయలుదేరింది.

పొట్టకూటికని వెళ్లి...

పొట్టకూటికని పనికెళ్లిన మాలావత్ ప్రవీణ్(30) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. నర్సాపూర్ మండలంలోని ఎల్లారెడ్డిగూడ తండాకు చెందిన మాలావత్ ప్రవీణ్ గాగిల్లాపూర్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మృతుడికి భార్య మధు, దివ్యాంగుడైన కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ప్రవీణ్ మృతితో ఎల్లారెడ్డిగూడ తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రమాదంలో నలుగురికి గాయాలు...

ప్రమాదంలో నర్సాపూర్ పట్టణానికి చెందిన ముగ్గురికి, ప్యాసింజర్ ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. నర్సాపూర్‌కు చెందిన వడ్డె రాజుకు చెందిన ఆటోలో గూనీ ప్రవీణ్, నవీన్ బోయిన్‌పల్లిలో కూరగాయలు తీసుకురావడానికి వెళ్లారు. పని ముగించుకొని తిరుగు ప్రయాణమయ్యారు. నర్సాపూర్ అటవీ ప్రాంతానికి రాగానే ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో ప్రవీణ్, రాజుకు తీవ్రగాయాలు కాగా, నవీన్‌కు స్వల్పగాయాలయ్యాయి. ప్రవీణ్ కండ్లకు తీవ్రగాయాలు కావడంతో హైదరాబాద్‌లోని సరోజినిదేవి దవాఖానకు, రాజుని సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్యాసింజర్ ఆటో డ్రైవర్ సంతుని మెరుగైన చికిత్స కోసం గాంధీ దవాఖానకు తరలించారు.

ఐశ్వర్య మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రక్తంచిందిన రహదారి

మెదక్ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం | ఇద్దరు యువతులు, యువకుడు అక్కడికక్కడే దుర్మరణం

మెదక్-బాలానగర్ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జైన కారు

మెదక్-బాలానగర్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాద దృశ్యం

- అతివేగంతో రెండు ఆటోలను ఢీకొట్టిన కారు
- దవాఖానకు తరలిస్తుండగా మరొకరు మృతి
- నర్సాపూర్ దవాఖానకు మృతదేహాల తరలింపు
- వేర్వేరు దవాఖానలకు ఐదుగురు క్షతగాత్రుల తరలింపు
- ఘటనా స్థలాన్ని సందర్శించిన పోలీసులు.. కేసు నమోదు

గుమ్మడిదల,జనవరి 3: మెదక్ జిల్లాలో మెదక్-బాలానగర్ రహదారిపై నల్లవల్లి అటవీ ప్రాంతంలో శుక్రవారం జరిగిన ఘోర రోడ్డుప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు.క్షతగాత్రులను సూరారంలోని మల్లారెడ్డి దవాఖానకు తరలిస్తుండగా మరొకరు మృతి చెందారు. జిన్నారం సీఐ నయిమోద్దీన్ వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో నర్సాపూర్ నుంచి స్విఫ్ట్‌డిజైర్ కారు (ఏపీ28డీవీ4801), ప్యాసింజర్ ఆటో (టీజీ35టీ 0168) నర్సాపూర్ నుంచి బాలానగర్ జాతీయ రహదారి వైపు బయలుదేరాయి. గుమ్మడిదల మండలం నల్లవల్లి అటవీ ప్రాంతంలోని మేడాలమ్మ ఆలయం సమీపంలో అతివేగంగా కారు దూసుకెళ్లి ఎదురుగా వస్తున్న (టీఎస్35 టీఏ 2586) ప్యాసింజర్ ఆటోను ఢీకొట్టింది. కారు వెనకనే వస్తున్న ప్యాసింజర్ ఆటో (టీజీ35టీ 0168) కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒక ప్యాసింజర్ ఆటోలో ముగ్గురు, మరో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురిలో మెదక్ జిల్లా పేరూరు గ్రామానికి చెందిన పాపగారి మనీషా(26), నర్సాపూర్ మండలం రుస్తుంపేటకు చెందిన ఐశ్వర్య(19), నర్సాపూర్ మండలం ఎల్లారెడ్డిగూడ తండాకు చెందిన ప్రవీణ్(30) ఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచారు. మరో ఐదుగురు ప్రయాణికులకు తీవ్రగాయాలు కావడంతో హుటాహుటిన సూరారం మల్లారెడ్డి దవాఖానకు తరలించారు. ఇందులో మార్గమధ్యలో కౌడిపల్లి మండలానికి చెందిన అనుసూయ(62) మృతిచెందింది. క్షతగాత్రులకు మల్లారెడ్డి దవాఖానలో చికిత్స అందిస్తున్నారు. ఆటోడ్రైవర్ సంతోష్ పరిస్థితి విషమంగా ఉండడంతో గాంధీ దవాఖానకు తరలించారు. కారులో ప్రయాణిస్తున్న భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జిన్నారం సీఐ నయిమోద్దీన్ తెలిపారు.

పాపం మనీషా, ఐశ్వర్య...

రంగారెడ్డి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం ఐడీఏ జీడిమెట్ల సంజయ్‌గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న పాపగారి మనీషాకు ఇటీవల నర్సాపూర్‌లో పంచాయతీ రాజ్ శాఖలో ఏఈఈగా ఉద్యోగం వచ్చింది. ఉద్యోగానికి వెళ్తున్న మనీషా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలియగానే తోటి ఉద్యోగులు ఘటనా స్థలానికి చేరుకుని ఆవేదన వ్యక్తం చేశారు. నర్సాపూర్ మండలానికి చెందిన దూది ఐశ్వర్య కాలేజీకి వెళ్లింది. కాలేజీకి తోటి విద్యార్థులు ఎవరూ రాకపోవడంతో తిరిగి ఇంటికి ఆటోలో వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మరో యువకుడు ప్రవీణ్ నర్సాపూర్ నుంచి ఆటోలో వస్తూ మృతి చెందాడు. మనీషా తల్లిదండ్రులు నర్సాపూర్ దవాఖానలో తమ కూతురు మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. ఇటీవల ప్రభుత్వం ఉద్యోగం రావడంతో ఆనందపడిన తల్లిదండ్రులకు గర్భశోకం మిగిలించిందని విలపించారు. చదువులో చురుగ్గా ఉన్న ఐశ్వర్య మృతితో తండ్రి అనిల్‌తోపాటు కుటుంబీకులు విలపించారు.

ఘటనా స్థలానికి భారీగా వచ్చిన జనం

కారు, ఆటోలు ఢీకొన్న ఘటనలో అక్కడికక్కడే ముగ్గురు మృతి చెందిన విషయం తెలియడంతో వందలాది మంది అక్కడికి చేరుకున్నారు. జిన్నారం సీఐ నయీమొద్దీన్, ఎస్సై మహేశ్వర్‌రెడ్డి సిబ్బందితో వచ్చి సహాయక చర్యలు చేపట్టారు. మృతులను నర్సాపూర్ దవాఖానకు తరలించారు. క్షతగాత్రులను మల్లారెడ్డి దవాఖానకు అంబులెన్స్ ద్వారా తరలించారు.

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ సంజీవరావు

ముగ్గురు నర్సాపూర్ వాసులు...

రోడ్డు ప్రమాదంలో అనసూయా, ప్రవీణ్, ఐశ్వర్య, మనీషాను మృత్యువు కబలించడంతో నర్సాపూర్ సర్కారు దవాఖాన వద్ద రోదనలు మిన్నంటాయి. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, పలువురు నాయకులు బాధిత కుటుంబాలను ఓదార్చారు.

పరిశీలించిన అదనపు ఎస్పీ

ప్రమాద ఘటనా స్థలాన్ని శుక్రవారం సంగారెడ్డి జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, జిన్నారం సీఐ నయిమొద్దీన్‌తో కలిసి పరిశీలించారు.

పరామర్శించిన ఎమ్మెల్యే

నర్సాపూర్, జనవరి 3: నల్లవల్లి అటవీ ప్రాంతం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ దవాఖాన లోని మార్చురీకి తరలించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మార్చురీకి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఆమె వెంట మున్సిపల్ వైస్‌చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్ఎస్ నాయకులు సత్యంగౌడ్, సూరారం నర్సింహులు, శివకుమార్, చంద్రశేఖర్, జితేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్


అక్కన్నపేటలో ప్రమాదబీమా చెక్కును అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అక్కన్నపేట, జనవరి 3: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ, ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం అక్కన్నపేటలోని ఎల్లమ్మ దేవాలయ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్ట్‌లను పూర్తి చేసి వ్యవసాయానికి సాగు నీటిని అందిస్తామన్నారు. రాష్ట్రంలో హుస్నాబాద్ నియోజకవర్గానికి మరింత గౌరవాన్ని కల్పిస్తానన్నారు. విద్య, వైద్య, సాగునీటి రంగాలకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు చెప్పారు. సంక్రాంతికి రైతు భరోసా ఇస్తామన్నారు. అనంతరం సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి మంత్రి నివాళులర్పించారు. గండిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అంబానాయక్‌తండాకు చెందిన గుగులోతు తిరుపతినాయక్ కుటుంబానికి రూ. 5లక్షల ప్రమాదబీమా చెక్కును మంత్రి అందజేశారు.

రెండు లక్షలపై రుణమాఫీ చేయాలి

మల్లంపల్లి రైతు వేదిక వద్ద రైతుల ధర్నా

అక్కన్నపేట: సంపూర్ణ రుణమాఫీ చేయాలని కోరుతూ ఏఈవో సంగీతకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

అక్కన్నపేట, జనవరి 3: అనేక హామీలిచ్చి.. అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ మోసం చేసిందని సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం మల్లంపల్లి రైతు వేదిక వద్ద రైతులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు, సింగిల్ విండో డైరెక్టర్ మ్యాక నారాయణ, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముత్తినేని వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ..రూ.2 లక్షలపై ఉన్న రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరుతో అందరినీ మోసం చేసిందన్నారు. ఏకకాలంలో ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి నిబంధనలు, షరతులు, కొర్రీలు పెట్టి సగం మంది రైతులు రుణమాఫీ వర్తింపచేయలేదన్నారు. రైతుభరోసా ఇవ్వక పోవడంతో రైతులు పెట్టుబడులకు అప్పులు చేస్తున్నారని, బోనస్ బోగస్ అయ్యిందని ఆరోపించారు. సంపూర్ణ రుణమాఫీ చేయాలని ఏఈవో సంగీతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

దూరం దూరం !

భట్టి పర్యటనకు మంత్రి దామోదర, జగ్గారెడ్డి గైర్హాజరు

- ఐఐటీహెచ్ సదస్సుకు హాజరైన డిప్యూటీ సీఎం భట్టి
- భట్టి వెళ్లాకే సంగారెడ్డి వచ్చిన మంత్రి దామోదర
- భట్టి విక్రమార్క తనను అవమానించారని జగ్గారెడ్డి అలక
- కాంగ్రెస్‌లో మరోమారు బయటపడిన అంతర్గత విభేదాలు

సంగారెడ్డి, జనవరి 3(నమస్తే తెలంగాణ): డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంగారెడ్డి జిల్లా పర్యటనకు జిల్లాకు చెందిన కాంగ్రెస్ అగ్రనేతలు దామోదర రాజనర్సింహ, జగ్గారెడ్డి దూరంగా ఉన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఇద్దరు రాష్ట్ర, జిల్లా రాజకీయాల్లో కీలక నేతలు. ఇద్దరు నేతలు శుక్రవారం జరిగిన డిప్యూటీ సీఎం అధికార కార్యక్రమానికి గైర్హాజరు కావడం కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలకు అద్దం పడుతుందన్న ప్రచారం సాగుతున్నది. ఇద్దరు నేతలు డిప్యూటీ సీఎం జిల్లా పర్యటనకు డుమ్మా కొట్టడం కాంగ్రెస్‌లో హాట్ టాపిక్‌గా మారింది. సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన ఇండియా-ఆస్ట్రేలియా క్రిటికల్ మినరల్స్ వర్క్‌షాప్‌నకు డిప్యూటీ సీఎం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా ఆయనను కలవడం ఆనవాయితీ. అయితే భట్టి విక్రమార్క పర్యటనకు జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహతోపాటు సంగారెడ్డి నియోజకవర్గానికి చెందిన పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి హాజరు కాలేదు. మంత్రి దామోదర రాజనర్సింహ శుక్రవారం సంగారెడ్డి పట్టణంలో పర్యటించారు. కానీ, డిప్యూటీ సీఎం పర్యటనకు మాత్రం దూరంగా ఉన్నారు. భట్టి విక్రమార్క జిల్లా నుంచి బయలుదేరిన తర్వాతే మంత్రి దామోదర సంగారెడ్డికి వచ్చి స్థానికంగా ఏర్పాటు చేసిన అధికార కార్యక్రమాల్లో పాల్గొనడం విశేషం. మంత్రి భట్టి విక్రమార్క జిల్లా పర్యటన ఉందని తెలిసినప్పటికీ మంత్రి దామోదర ఉద్దేశపూర్వకంగానే ఆయనను కలవలేదని తెలుస్తున్నది. కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న పవర్ పాలిటిక్స్ కారణంగానే ఆయన భట్టి పర్యటనకు దూరంగా ఉన్నట్లు సమాచారం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డిప్యూటీ సీఎంగా పనిచేసిన మంత్రి దామోదర రాజనర్సింహ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే తనకు ముఖ్యమైన పదవి లభిస్తుందని ఆశించారు. కాంగ్రెస్ అధిష్టానం దళిత నేతకు ముఖ్యమంత్రి పగ్గాలు అప్పగించే యోచన చేస్తున్న క్రమంలో భట్టి విక్రమార్కతోపాటు దామోదర రాజనర్సింహ సీఎం రేసులో ఉన్నారు. కాంగ్రెస్ అధిష్టానం రేవంత్‌రెడ్డికి సీఎం పదవి కట్టబెట్టింది. సీఎం పదవి ఆశించిన దామోదర రాజనర్సింహకు కాంగ్రెస్ అధిష్టానం డిప్యూటీ సీఎం పదవి ఇవ్వకుండా మంత్రి పదవికే పరిమితం చేసింది. తనకు కీలక పదవి దక్కకుండా రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క పావులు కదిపారన్న అసంతృప్తి దామోదరలో ఉన్నట్లు తెలుస్తుంది. ఈ కారణంగానే డిప్యూటీ పర్యటనకు గైర్హాజరైనట్లు కాంగ్రెస్ క్యాడర్ చర్చించుకుంటున్నారు.

భట్టి తీరుతో జగ్గారెడ్డి అలక?

సీఎం వర్గానికి చెందిన వ్యక్తిగా ముద్రపడిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంగారెడ్డి జిల్లా పర్యటనకు దూరంగా ఉండడం కాంగ్రెస్‌లో హాట్ టాపిక్‌గా మారింది. రాష్ట్ర మంత్రులు జిల్లా పర్యటనకు వచ్చిన సమయంలో జగ్గారెడ్డి మర్యాదపూర్వకంగా వారిని కలుస్తుంటారు. ఇటీవలే మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఐఐటీ హైదరాబాద్‌లో పర్యటించగా, జగ్గారెడ్డి ఆయనతోపాటు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శుక్రవారం నాటి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటనకు మాత్రం జగ్గారెడ్డి డుమ్మా కొట్టారు. ఇది ప్రస్తుతం కాంగ్రెస్‌లో హాట్ టాపిక్‌గా మారింది. తన సొంత నియోజకవర్గమైన సంగారెడ్డిలో పర్యటనకు వచ్చిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తనకు ముందస్తు సమాచారం ఇవ్వలేదని జగ్గారెడ్డి ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తుంది. దీనికి తోడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తన ప్రసంగంలో సంగారెడ్డిలో ఐఐటీహెచ్ ఏర్పాటుకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కీలకపాత్ర పోషించారని ప్రస్తావించారు. తాను ఎమ్మెల్సీగా ఐఐటీహెచ్ ఏర్పాటులో భాగస్వామిగా ఉన్నట్లు చెప్పారు. జగ్గారెడ్డి పేరు ఎక్కడా ప్రస్తావించ లేదు. కందిలో ఐఐటీహెచ్ ఏర్పాటు కోసం తాను ఉద్యమించానని, తన వల్లే ఐఐటీహెచ్ ఏర్పాటైందని, అలాంటిది డిప్యూటీ సీఎం తన పేరు ప్రస్తావించకుండా అవమానించారని జగ్గారెడ్డి ఆగ్రహంగా ఉన్నట్లు క్యాడర్ ద్వారా తెలిసింది. డిప్యూటీ సీఎం తీరుపై అధిష్టానానికి ఫిర్యాదు చేసేందుకు జగ్గారెడ్డి సిద్ధమవుతున్నట్లు సమాచారం. భట్టి విక్రమార్క సీఎం పదవి కోసం అంతర్గతంగా పావులు కదుపుతుండడం నచ్చని జగ్గారెడ్డి ఆ కారణంగానే ఉద్దేశపూర్వకంగా భట్టి కార్యక్రమానికి డుమ్మాకొట్టారన్న ప్రచారం కాంగ్రెస్ వర్గాల్లో సాగుతున్నది. కాంగ్రెస్‌లో పవర్ పాలిటిక్స్, నేతల మధ్య అంతర్గత విభేదాలకు భట్టి విక్రమార్క సంగారెడ్డి జిల్లా పర్యటన అద్దం పడుతున్నదని కాంగ్రెస్ నేతలు ప్రైవేటు సంభాషణల్లో చెప్పుకుంటున్నారు.

కేజీవీబీ ఉద్యోగుల సమ్మె విచ్ఛిన్నానికి ప్రభుత్వం కుట్ర

సంగారెడ్డిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

- వారి సమస్యలను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం
- ఉమెన్ టీచర్స్‌దే ఒక రాజకీయ జిమ్మిక్కు
- షరతులు లేకుండా రైతుభరోసా ఇవ్వాలి
- సంగారెడ్డిలో మీడియా సమావేశంలో సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

సంగారెడ్డి, జనవరి 3(నమస్తే తెలంగాణ): కేజీవీబీ ఉద్యోగుల సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు కాంగ్రెస్ మంత్రులు కుట్ర చేస్తున్నారని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ఆరోపించారు. శుక్రవారం సంగారెడ్డిలోని సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కేజీవీబీ ఉద్యోగులు చేస్తున్న 25 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం అన్నారు. కేజీవీబీ ఉద్యోగుల సమ్మెను అణిచివేయాలని ప్రభుత్వం చూస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమ్మెను విఫలం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే కేవీజీవీ ఉద్యోగులతో చర్చలు జరిపి వారి న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సావిత్రిబాయి పూలే జయంతిని ఉమెన్స్ టీచర్స్ డేగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం ఓ రాజకీయ జిమ్మిక్కుగా ఆయన అభివర్ణించారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో ఆడ పిల్లలు అక్షరాస్యతలో వెనకబడి ఉన్నట్లు గుర్తుచేశారు. సావిత్రబాయి పూలేపై గౌరవం ఉంటే ప్రభుత్వం ఆడపిల్లల అక్షరాస్యతాశాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ జమిలి ఎన్నికల అంశాన్ని తెరపైకి తెచ్చిందన్నారు. జమిలి ఎన్నికల బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందడం సాధ్యం కాదని బీజేపీకి కూడా తెలుసు అన్నారు. అయినప్పటికీ జమిలి ఎన్నికల బిల్లుపై రాజకీయం చేస్తున్నదని రాఘవులు విమర్శించారు. పంజాబ్ రైతు దలేవాల్ చేస్తున్న నిరాహార దీక్షను కేంద్ర ప్రభుత్వం విరమింపజేయాలని డిమాండ్ చేశారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తామని చెప్పిన బీజేపీ ప్రభుత్వం, ఇప్పటి వరకు ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. గిట్టుబాటు ధరల విషయంలో కోర్టు మొట్టికాయలు వేసినా కేంద్రం స్పందించడం లేదన్నారు. సీపీఎం రాష్ట్ర నాయకులు చేరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలన్నారు. విలేకరుల సమావేశంలో సీపీఎం రాష్ట్ర నాయకులు చుక్క రాములు, ఎంఏ రమణ, జిల్లా నాయకులు జయరాజ్, బి.మల్లేశం, మాణిక్యం, అడివయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పరిశీలించిన అధికారులు

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనం

హుస్నాబాద్, జనవరి 3: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో ప్రభుత్వ భూమిని రియల్టర్లు ఆక్రమించుకునే యత్నం చేస్తున్నారనే 'నమస్తే తెలంగాణ' కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. 'ప్రభుత్వ భూమిపై గద్దల కన్ను' అనే శీర్షికన శుక్రవారం సిద్దిపేట టాబ్లాయిడ్‌లో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. శుక్రవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌తో పాటు సిబ్బంది అన్యాక్రాంతం కాబోతున్న ప్రభుత్వ భూమిని పరిశీలించి 93 సర్వే నంబర్ హద్దులపై విచారణ జరిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ..93 సర్వే నంబర్‌లోని 24ఎకరాల భూమిలో గుంట కూడా అన్యాక్రాంతం కానీయమని, ఇప్పటికే ఆర్ఐతోపాటు సర్వేయర్ స్థలాన్ని పరిశీలించారని, రెండు రోజుల్లో మొత్తం భూమికి హద్దులు పాతుతామని చెప్పారు. ఆ భూమిలో ఎలాంటి పనులు చేయొద్దని, ఎవరూ స్థలం వైపు రావొద్దని ఆదేశాలు సైతం జారీ చేశామన్నారు. 93 సర్వే నంబరుతోపాటు పట్టణంలోని అన్ని ప్రభుత్వ భూముల సంరక్షణకు చర్యలు చేపడుతామని తహసీల్దార్ తెలిపారు.

చేర్యాల ఏఎంసీ చైర్‌పర్సన్ ఆత్మహత్యాయత్నం?

ఫుడ్ పాయిజన్ కారణమన్న భర్త

చేర్యాల, జనవరి 3 : సిద్దిపేట జిల్లా చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నల్ల నాగుల శ్వేత పురుగుల మందు తాగి జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని కట్కూరు(స్వగ్రామం)లో ఆత్మహత్యకు యత్నించినట్లు శుక్రవారం వాట్సాప్ గ్రూపుల్లో వైరలయింది. రాత్రి సమయంలో ఆమె పురుగుల మందు తాగడంతో భర్త వెంకటాచారి హుటాహుటిన జనగామ దవాఖానకు తరలించి ప్రాథమిక చికిత్స అందించి, అక్కడి వైద్యుల సూచనతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిసింది. తన భార్య ఆత్మహత్యకు యత్నించినట్లు సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఫుడ్ పాయిజన్‌తోనే అస్వస్థతకు గురికావడంతో జనగామక